
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
సోమవారం 2 జూన్ 2025



ఎండీయూ వాహనాలకు చెక్

- ఊరూరా.. చౌకదుకాణాలు పునఃప్రారంభం
- గత పాలనలో రేషన్ బండ్ల విధానం
- దుకాణాల్లో పంపిణీతో తొలగిన ఇబ్బందులు

నాలుగున్నరేళ్ల కిందట వైసీపీ పాలనలో తెచ్చిన ఇంటింటికీ వాహనాల్లో రేషన్ బియ్యం పథకాన్ని రద్దు చేస్తూ.. జిల్లా వ్యాప్తంగా ఆదివారం చౌకదుకాణాలు పునఃప్రారంభమయ్యాయి. వైసీపీ పాలనలో తెచ్చిన ఇంటి వద్దకే బియ్యం పంపిణీ విధానంలో ఎప్పుడు వాహనాలు మా వీధిలోకి వస్తాయా..? ఎప్పుడు రేషన్ తీసుకోవాలా ? అనే లబ్ధిదారుల ఆందోళనకు తెరపడింది. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీ పునఃప్రారంభించడంతో ఈ సమస్య తీరింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రేషన్‌కార్డుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో రేషన్ డీలర్లు సైతం తమ ఉనికిని కాపాడుకుంటామని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గత ప్రభుత్వంలో రేషన్ వాహనం వద్ద గుంపులుగా వున్న వినియోగదారులు (ఫైల్)

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చౌకదుకాణాలను నిర్వీర్యం చేస్తూ.. ఇంటి వద్దకే వాహనాల్లో సరుకుల పంపిణీ (ఎండీయూ) తెచ్చింది. అయితే ఈ విధానం విజయవంతం కాలేదు. కనీసం ఒక నెల కూడా లబ్ధిదారుల ఇంటి వద్దకు వాహనాలు వెళ్లి సరుకులు ఇవ్వలేదు. వారికి ఇష్టమొచ్చినప్పుడు ఎక్కడో వీధి చివర ఒక చోట ఈ వాహనాలు నిలిపి.. లబ్ధిదారులు అందరినీ అక్కడికే పిలిపించి సరుకులు ఇచ్చేవారు. రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనం ఎప్పుడు వస్తుందో ? ఖచ్చితంగా తెలియక.. ప్రజలు తమ పనులు మానుకుని.. ఎదురు చూడాల్సి వచ్చేది.

తొలగనున్న ఇబ్బందులు

చౌకదుకాణాలను పునఃప్రారంభించడం ద్వారా.. గత నాలుగున్నరేళ్లుగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు తొలగనున్నాయి. ఆదివారం జిల్లాలోని 1123 చౌకదుకాణాల్లో రేషన్‌సరుకుల పంపిణీ మొదలైంది. జిల్లాలో 4,97,969 రేషన్‌కార్డులు ఉండగా.. మొత్తం 14,82,094 మంది లబ్ధిదారులు రేషన్ పొందుతున్నారు. ఇందులో 65 సంవత్సరాలు పైబడిన కార్డులు 53,707 కార్డులు ఉన్నాయి. 69,336 మందికి లబ్ధి కలగనుంది. ప్రతి నెలా 1 నుంచి 15 వరకు ఉదయం, సాయంత్రం రెండు పూటలా సరుకులు పంపిణీ చేయనున్నారు. దీనివల్ల లబ్ధిదారులు ఎవరూ తమ పనులు మానుకుని.. రేషన్ కోసం ఎదురు చూడకుండా.. తమకు వీలు దొరికినప్పుడే చౌకదుకాణం నుంచి సరుకులు తెచ్చుకోవచ్చు. అదే విధంగా ఒకరు, ఇద్దరు సభ్యులు ఉన్న కార్డుల్లోని 65 సంవత్సరాల పైబడిన వాళ్లు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ చేయనున్నారు. ప్రతి నెలా 1 నుంచి 5 వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో పంపిణీ చేయనున్నారు.

ఎదురు చూడాల్సిన పని ఉండదు



గత వైసీపీ ప్రభుత్వంలో వాహనాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేసేవారు. ఆ వాహనాలు ఎప్పుడు వచ్చేవో.. మాకు తెలిసేది కాదు. అప్పుడు వారం రోజులుగా కేవలం రేషన్ సరుకుల కోసం ఇతర పనులను వదులుకుని ఎదురు చూసేవాళ్లము. ప్రస్తుతం రేషన్ షాపు దగ్గరే బియ్యం తీసుకోవడం చాలా సంతోషం. ఒకటో తేదీ నుంచి 15 లోపల వీలు ఉన్నప్పుడు వెళ్లి తెచ్చుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రజలకు చాలా మేలు చేసినట్లు అవుతుంది.

- యోగాంజులు, ఆవులరెడ్డిగారిపల్లె, గాలివీడు

అథంటికేషన్ సమస్య తీరింది



రేషన్ దుకాణాల పునఃప్రారంభంతో డీలర్లకు అథంటికేషన్ సమస్య తీరింది. గత ప్రభుత్వం తెచ్చిన ఎండీయూ విధానంతో సరుకుల పంపిణీ చాలా కష్టంగా ఉండేది. దీంతో రేషన్‌దుకాణాలు తెరిచినా.. వీఆర్‌వో, వీఆర్‌ఏ అథంటికేషన్ కోసం ఇబ్బంది పడేవాళ్లం. రేషన్ సరుకులు పంపిణీ చేయాలంటే.. కష్టంగా ఉండేది. ఈ సమస్యను పరిష్కరిస్తూ.. కూటమి ప్రభుత్వం రేషన్ దుకాణాలను పునఃప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రక్రియతో ప్రజలకు అనుకూలంగా సరుకులు పంపిణీ చేస్తాం.

- రెడ్డి రమణ, రేషన్ డీలర్, గుర్రంకొండ

డీలర్లకు గుర్తింపు వస్తుంది



నాలుగున్నరేళ్లు ఖాళీగా కూర్చున్నాము. ఇప్పుడు ప్రజల వద్ద స్టోర్ డీలర్లకు గుర్తింపు వస్తోంది. 50 శాతం మంది డీలర్లు చౌకదుకాణాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పద్ధతి చాలా బాగుంది. సర్వర్ సమస్య రాకుంటే.. వినియోగదారులకు సత్వరమే సేవలందించవచ్చు.

- మౌలాలి, జిల్లా ప్రధాన కార్యదర్శి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం

రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



రెడ్డివారిపల్లెలో వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

రాయచోటిటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1123 చౌక ధరల దుకాణాల ద్వారా అత్యంత పారదర్శకంగా రేషన్ పంపిణీ జరగాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ జరుగుతోంది. ఇందులో భాగంగా 65 సంవత్సరాల పైబ డిన వారికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ జరగనున్నది. ఈ సందర్భంగా ఆయన ఆదివారం చెన్నముక్కపల్లి (షాప్ నెంబర్ 31), రెడ్డివారిపల్లి (షాప్ నెంబర్ 1)లలో రేషన్ పంపిణీని పునఃప్రారంభించి పలువురు లబ్ధిదారులకు రేషన్ అందించారు. అనంతరం రెడ్డివారిపల్లికి చెందిన రాజారెడ్డి, చెన్నముక్కపల్లెకు చెందిన వెంకటరెడ్డి, దుగ్గిరెడ్డిలు 65 ఏళ్లకు పైబడిన వారు కావడంతో ఇంటి వద్దనే స్వయంగా 10 కేజీల బియ్యం, అరకేజీ చెక్కర, రేషన్ పంపిణీ చేసి వారితో పలు విషయాలపై ముచ్చటించారు. అనతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1123 చౌకధరల దుకాణాలు ఉన్నాయని, మొత్తం రేషన్‌కార్డులు 4,97,969 ఉన్నాయని, మొత్తం రేషన్‌కార్డుల ద్వారా 14,82,094 మంది సభ్యులు రేషన్ ద్వారా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. ఇందులో 65 ఏళ్ల పైబడిన కార్డుల సంఖ్య 57,707లు ఉన్నాయని, ఈ కార్డుల ద్వారా 69,336 మంది సభ్యులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు. ప్రతి నెల 1-15వ తేది వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. చౌకధరల దుకాణాల ద్వారా బలవర్థకమైన బియ్యం, చెక్కర, కొన్ని దుకాణాల్లో జొన్నలు కూడా అందుబాటులో ఉన్నాయని, బియ్యం, జొన్నలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల మధ్య పోస్టుల బదిలీ

- బోధన, బోధనేతర పోస్టుల సర్దుబాటు

కలికిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మధ్య పోస్టులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మొత్తం 15 పోస్టులు ఇతర ప్రాంతాల కళాశాలలకు బదిలీ కాగా నాలుగు పోస్టులు మాత్రం ఇతర ప్రాంతాల నుంచి ఈ రెండు జిల్లాలకు బదిలీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య, అవసరాలు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 109 బోధన, 201 బోధనేతర పోస్టులను పరస్పరం బదిలీ చేసింది. దీని ప్రకారం పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి సింహాద్రిపురం కళాశాలకు టెక్స్‌టైల్స్ టెక్నాలజీ సీనియర్ లెక్చరర్ పోస్టును బదిలీ చేశారు. అదే విధంగా హిందూపురం కళాశాల నుంచి కడప మహిళా పాలిటెక్నిక్‌కు కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టును, మడకశిర నుంచి వేంపల్లె కళాశాలకు ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులను బదిలీ చేశారు. ఇక కడప, అన్నమయ్య జిల్లాల్లోని కడప మహిళా పాలిటెక్నిక్ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పోస్టును తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు, మదనపల్లె పాలిటెక్నిక్ నుంచి ప్రొద్దుటూరు కళాశాలకు మరో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పోస్టును బదిలీ చేశారు. మదనపల్లె కళాశాల నుంచి కంప్యూటర్ ఇంజినీరింగ్ లెక్చరర్ పోస్టును కల్యాణదుర్గం కళాశాలకు, మదనపల్లె నుంచే ఫిజికల్ డైరెక్టర్ పోస్టును గుంటూరు మైనారిటీస్ పాలిటెక్నిక్‌కు, కలికిరి పాలిటెక్నిక్ నుంచి తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు కెమిస్ట్రీ పోస్టును, రాజంపేట కళాశాల నుంచి వేంపల్లె, కమలాపురం పాలిటెక్నిక్ నుంచి సింహాద్రిపురం కళాశాలలకు ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక జమ్మలమడుగు కళాశాల నుంచి ఇంగ్లీషు లెక్చరర్ పోస్టును కడప మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. రాయచోటి కళాశాల నుంచి కూడా ఇంగ్లీషు లెక్చరర్ పోస్టును ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఇక బోధనేతర సిబ్బంది పోస్టుల్లోనూ కొందరిని వైఎస్‌ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు, అక్కడి వారిని కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

అనుమానం పెనుభూతమై..

భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న భర్త



నిత్యానంద్, లక్ష్మీకుమారి మృతదేహాలు

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమై.. కట్టుకున్న భార్యను కడతేర్చడమే కాక.. తానూ ఉరేసుకుని చనిపోయాడు. ఇద్దరు చిన్నారులను, నడవలేని తల్లిని అనాథలను చేశాడు. ఈ విషాద సంఘటన చెన్నూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చెన్నూరు ఆర్సీయం చర్చి సమీపంలోని కుమ్మరివీధికి చెందిన వల్లెపు నిత్యానంద్ (37)కు ఖాజీపేట మండలం నాగసానిపల్లె పంచాయతీ పరిధిలోని లక్ష్మింపల్లెకు చెందిన లక్ష్మికుమారి(29)తో పదేళ్లక్రితం వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి వీరు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. వీరికి గంగ మేఘన (8), గంగ మౌనిక (5) కుమార్తెలు. ఇతను ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నిత్యానంద్ తల్లి లక్షుమ్మ చాలాకాలంగా అనారోగ్యంతో మంచంపైనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలనే ఆలోచనతో నిత్యానంద్ గతంలో ఒకసారి కువైట్ వెళ్లి ఏడాదిన్నర పాటు ఉండి తిరిగి వచ్చాడు. ఆర్నెళ్లు ఆటో తోలాడు. తిరిగి ఏడాదిన్నర క్రితం కువైట్ వెళ్లాడు. 11 రోజుల క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన రోజునుంచీ భార్యతో, పిల్లలతో చాలా ప్రేమగా ఉన్నాడు. పిల్లలు ఏమడిగినా తీసిస్తూ వచ్చాడు. అయితే ఇతనికి భార్యపై అనుమానం పెరిగింది. దీంతో నాలుగురోజుల నుంచి భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో బయట వరండాలో నిద్రిస్తున్న భార్యను లోపలికి తీసుకెళ్లాడు. లోపలి నుంచి కేకలు వినిపించాయి. దీంతో బయట నిద్రపోతున్న ఇద్దరు కుమార్తెలు మేలుకుని అమ్మ ఏడుపు విని లోపలికి వెళ్లి చూడగా తండ్రి నిత్యానంద్ వారిని బయటికి తోసి తలుపు గడియపెట్టాడు. అదే సమయంలో మంచంలో నిద్రపోతున్న అతని తల్లి లక్షుమ్మ కుమారుడిని వారించాలని ప్రయత్నించినా అతను వినలేదు. కొడుకును గట్టిగా అరుస్తూ కోడలిని ఏమీ చేయవద్దని తల్లిచెబుతున్నా.. మరోవైపు బిడ్డలు ఏడుస్తున్నా.. నిత్యానంద్ పట్టించుకోకుండా భార్య మెడకు చున్నీ బిగించి కొక్కీకి ఉరివేసి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోనే శవాన్ని పడుకోబెట్టాడు. తెల్లారితే ఎలాంటి సమస్య వస్తుందో ఏమో అనే భయంతో లోపలే ఉన్న బాత్‌రూంలో ఉరి వేసుకున్నాడు. వీరి కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. అయితే ఎవ్వరూ తలుపు తీసే సాహసం చేయలేదు. తెల్లవారినా నిత్యానంద్ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్థానికులు తలుపులు పగలకొట్టారు. బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్న నిత్యానంద్, గదిలో ఉన్న లక్ష్మీకుమారి మృతదేహాలను పోలీసులు పరిశీలించారు. లక్ష్మీకుమారి అన్న వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

హౌసింగ్ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

- రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్



బీరంగిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్

బి.కొత్తకోట జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో పని చేసి పక్కా గృహాల నిర్మాణాలను గడువులోగా పూర్తయ్యేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ చీఫ్ ఇంజనీర్ ఎస్.వేణుగోపాల్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం బి.కొత్తకోట మండలంలోని బీరంగి గ్రామంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి పక్కా గృహనిర్మాణాల తీరును పర్యవేక్షించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి గృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రూ.50 వేలు ప్రభుత్వం అదనంగా ఇస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకొని నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికానున్న సందర్భంగా ఈ నెల 12న సీఎం చంద్రబాబు 3 లక్షల పక్కా గృహాలను ప్రారంభించనున్న నేపథ్యంలో త్వరగా పక్కా గృహాలను పూర్తి చేసేలా సిబ్బంది ప్రయత్నించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివయ్య, ఈఈ రమేష్‌రెడ్డి, డీఈ వెంకటరెడ్డి, లావణ్య సిబ్బంది ఉన్నారు.

అల్లుడిని దారుణంగా హత్య చేసిన మామ

7

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణమా ?



నేడు జడ్పీలో బదిలీలు ?

కడపరూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీలకు వేళయింది. ఉమ్మడి కడప జిల్లాలోని జిల్లా ప్రజాపరిషత్ శాఖలో 2025కు గాను సోమవారం ఉద్యోగుల బదిలీలు చేపట్టనున్నారు. బదిలీ అయ్యే ఉద్యోగులకు జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ చర్యలు చేపట్టారు. జడ్పీ పాలకమండలి వైసీపీ ఆధీనంలో ఉండడంతో బదిలీలను తమకు అనుకూలంగా సాగించేందుకు పట్టు బిగించారని సమాచారం. కాగా.. 2014-19 టీడీపీ పాలనలో జడ్పీ పాలకమండలి వైసీపీ ఆధీనంలో ఉన్నప్పటికీ నాటి జీవో ప్రకారం అప్పటి జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ సీఈవోగా జడ్పీ చైర్మన్ ప్రమేయం లేకుండానే బదిలీలు నిర్వహించారు. ప్రస్తుత టీడీపీ కూటమి పాలనలోని జడ్పీ సీఈవో మాత్రం జడ్పీ బదిలీలను చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

జడ్పీలో వైసీపీ నేతల అండ ఉన్న పలువురు ఉద్యోగులు, సిబ్బంది 5 ఏళ్ల పైబడి తిష్టవేసి ఒకేచోట పనిచేస్తున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. వీరిని ప్రస్తుత బదిలీల్లో కూడా కదిలించవద్దంటూ అధికారులపై తీవ్ర వత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. జడ్పీ శాఖలోని ఆయా విభాగాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు 164 మంది ఉన్నారు. కానీ వీరిలో బదిలీలకు 72 మందే దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన 92 మందిని బదిలీ జాబితా నుంచి నడలింపు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. కాగా.. కొంతమంది నేతలు, ఉద్యోగ సంఘాలు సమయం పొడిగించాలని చేసిన అభ్యర్థన మేరకు జూన్ 9 వరకు బదిలీల సమయాన్ని పొడిగిస్తున్నట్లు ఆదివారం ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో సోమవారం జడ్పీలో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందా లేదా అనే విషయంలో సందిగ్ధత ఏర్పడింది. దీనిపై జడ్పీ సీఈవో ఓబులమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. బదిలీల గడువు పెంచినట్టు తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని, దీంతో సోమవారం బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- ఎనిమిది వారాలుగా అందని బిల్లులు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.10.03 కోట్ల బకాయిలు



ములకలచెరువు సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ములకలచెరువు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు ఆకలి కేకలు పెడుతున్నారు. ఎనిమిది వారాలుగా ఉపాధి కూలీలకు బిల్లులు ఆగిపోయాయి. కూలీల ఖాతాల్లోకి డబ్బులు జమ కావడం లేదు. దీంతో బిల్లులు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూస్తున్నారు. ఒక్క తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.10.03 కోట్లు కూలీలకు బాకాయిలు రావాల్సి ఉంది. ఎండనకా...వనకా కష్టపడి పనిచేస్తున్నా సకాలంలో వేతనాలు అందడం లేదని వాపోతున్నారు. రాష్ట్రంలోనే వెనుకబడిన నియోజకవర్గంగా పేరొందిన తంబళ్లపల్లెలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నియోజవర్గంలోని ములకలచెరువు, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో ప్రతిరోజూ 14 వేల మంది వరకు ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఎనిమిది వారాలుగా వేతనాలు అందడం లేదు. ఈ ఏడాది మార్చి 9వ తేదీ చివరిగా పనులు చేసిన కూలీల ఖాతాల్లోకి బిల్లులు పడ్డాయి. అప్పటి నుంచి కూలీలకు బిల్లులు రాలేదు. ప్రతి రోజూ పనులు చేస్తున్నా బిల్లులు ఖాతాల్లోకి పడకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలీ కెళితే గానీ పూట గడవని కూలీలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. బిల్లుల కోసం ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లా అంతటా ఉపాధి కూలీలకు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

3,21,998 పని దినాలకు... రూ.10.03 కోట్లు

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 3,21,998 పనిదినాలకు రూ.10.03 కోట్లు కూలీలకు వేతనం అందాల్సి ఉంది. బి.కొత్తకోట మండలంలో 34,712 పని దినాలకు రూ.1.41 కోట్లు, ములకలచెరువులో 97,599 పనిదినాలకు రూ.2.94 కోట్లు, పెద్దమండ్యంలో 69,644 పనిదినాలకు రూ.2.09 కోట్లు, తంబళ్లపల్లెలో 67,934 పనిదినాలకు రూ.2.04 కోట్లు, పెద్దతిప్పసముద్రంలో 29,834 పనిదినాలకు రూ.90 లక్షలు, కురబలకోటలో 22,275 పనిదినాలకు రూ.67 లక్షల బిల్లులు నిలిచిపోయాయి

బిల్లులు వెంటనే చెల్లించాలి



ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి. బిల్లులు జమ కాకపోవడంతో జీవనానికి ఇబ్బందిగా మారింది. ఇతర పనులకు వెళదామన్నా దొరకడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని బిల్లులు చెల్లించాలి.

- కోట నరసమ్మ, ఉపాధి కూలీ, రాగిమానిపల్లె, ములకలచెరువు

బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం



బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎనిమిది వారాల వేతనం రావాలి. రోజూ క్రమం తప్పకుండా పనులకు వెళ్తున్నాం. బిల్లులు దిక్కుతోచని స్థితిలో పడ్డాం. పనులకు వెళ్తే గానీ కడుపు నిండదు.

- గెంటాల వెంకటరమణ, ఉపాధి కూలీ, రాగిమానిపల్లె, ములకలచెరువు

ఆరు రోజుల్లోపు కూలీల ఖాతాల్లోకి నగదు జమ



ఆరు రోజుల్లోగా పనిచేసిన కూలీల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది. టెక్నికల్ సమస్యల కారణంగా ఉపాధి కూలీలకు ఎనిమిది వారాలుగా వేతనం అందలేదు. వచ్చే నెల 4వ తేదీలోగా కూలీలకు పూర్తి స్థాయిలో వేతనాలు జమ అవుతాయి. పని అడిగిన చోట కూలీలకు పనులు కల్పిస్తాము.

- నందకుమార్‌రెడ్డి, డ్వామా ఏపీడీ, ములకలచెరువు క్లస్టర్

అడ్డగోలుగా వెంచర్లు

● పంచాయతీల ఆదాయానికి గండి ● అనుమతుల మంజూరులో అధికారుల చేతివాటం



వెల్లటూరు గ్రామ పరిధిలో వేసిన వెంచర్

పెండ్లిమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో కూడా ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటూ సకల వసతులతో గృహాలు నిర్మించుకుంటున్నారు. అలాగే పట్టణాలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో పల్లెల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని కడప-పులి వెందుల ప్రధాన రహదారి వెంబడి పుట్టగొడుగుల్లా లేఔట్లు పుట్టుకొస్తున్నాయి. నిన్నటి దాకా పంట పొలాలతో కళకళలాడిన భూములు ఇప్పుడు వెంచర్లుగా మారి సరిహద్దులు రంగురాళ్లతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి నివాస ప్రాంతాల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రాంతాన్ని బట్టి కనీసం సెంటు రూ.3లక్షల నుంచి గరిష్ఠంగా రూ.10లక్షల వరకు ధర పలుకుతోంది.

పంచాయతీల అనుమతి తప్పనిసరి

మండల పరిధిలో ఎక్కడైనా ఒక లేఔట్ వేయాలంటే గ్రామపంచాయతీ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. రంపతాడు, మొయిళ్లకాల్వ, తిప్పిరెడ్డిపల్లె, వెల్లటూరు, పాతసంగటిపల్లె, నందిమండలం, పెండ్లిమర్రి గ్రామాల పరిధిలో ఎక్కువగా లేఔట్లు వెలిశాయి. దాదాపు మూడు వందల ఎకరాల్లో వెంచర్లు వేశారు. నిబంధనల ప్రకారం లేఔట్లో రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్, గ్రీనరీ, కమ్యూనిటీ హాలు, ప్రార్థన మందిరాలకు స్థలాలు కేటాయించాలి. వీటన్నింటికి పంచాయతీ తీర్మానం అవసరం. వీటన్నింటికి కలిపి పంచాయతీకి డబ్బులు చెల్లించాలి. వాటి ద్వారా వచ్చిన నిధులను గ్రామ పంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవాలి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే రియల్టర్లు పంచాయతీలకు చెల్లించాల్సిన డబ్బులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు చెల్లిస్తున్నారు. ఆ కార్యదర్శులకు డబ్బులే కాక వెంచర్లలో ప్లాట్లను బహుమతులుగా పొందుతున్నారు. ఏ పంచాయతీలో కూడా ఈ నిధులను ఖర్చు చేసిన పాపాన పోలేదు.

అధికారుల చేతివాటం

మండలాల్లో లేఔట్లు వేయాలంటే పంచాయతీ తీర్మానాలతో పాటు, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. వ్యవసాయ భూములు కావడంతో ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. కడప నగరం దినదినాభివృద్ధి చెందడంతో నగరానికి చుట్టుపక్కల ఉన్న మండలాల్లో భూములకు విలువ అమాంతం పెరిగింది. దీంతో మండ లంలో ఎక్కడ పడితే అక్కడ ఇష్టాను సారంగా అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే ఇబ్బడిముబ్బడిగా రియల్టర్లు అధికారులను మేనేజ్ చేసి వెంచర్లు వేసారు. అనుమతులు లేని ప్లాట్లను కొనుగోలు చేసి జనం మోసపోతున్నారు. వెల్లటూరు పంచాయతీలోనే రూ.10,57,827లు దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇక అనధికారికంగా దాదాపు రూ.65లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. ఇక రంపతాడు, మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలలో ఈ లేఔట్ల ద్వారా వచ్చిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. ఈ పంచాయతీ నిధుల గోల్‌మాల్ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా.. అది ఈఓపీ ఆర్డీ పరిధిలో ఉంటుందన్నారు. ఇక మండలానికి రెగ్యులర్ ఈఓపీఆర్డీ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ను వివరణ అడగ్గా సమాచార హక్కు చట్టం ద్వారా అయితేనే వివరాలు చెబుతాం అని తెలిపారు. ఈ లేఔట్లు ఉన్న గ్రామ పంచాయతీలలో విచారణ జరిపితే భారీ అక్రమాలు బయట పడుతాయని స్థానికులు చెబుతున్నారు.

నెల్లూరు, కడప జట్ల విజయం



మన్విత్‌రెడ్డి, నెల్లూరు 109 పరుగులు



వాసుదేవరాజు (కడప) 99 పరుగులు

కడప స్పోర్ట్స్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం వివిధ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో, కడప జట్టు 21 రన్స్ తేడాతో ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. వివరాలిలా..

కేఎస్ఆర్ఎం మైదానంలో అనంతపురం - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 49 ఓవర్లలో 230 పరు గులకు ఆలౌట్ అయింది. ఇందులో వీరారెడ్డి 47 పరుగులు, వికాస్ 42 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో మన్విత్‌రెడ్డి 109 పరుగులు చేయడం విశేషం. దీంతో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో విజయభేరి మోగించినట్లయింది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య మరో మ్యాచ్ జరిగింది. ఇందులో టాస్‌నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 45 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. ఇందులో వాసుదేవరాజు 99 పరుగులు సాధించి. ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ అయ్యాడు. మరో బ్యాట్స్‌మెన్ విజయరామిరెడ్డి 61 పరుగులు సాధించి భారీ స్కోరుకు బాటలు వేశారు. ఇక బౌలింగ్ విభాగంలో కర్నూలు జట్టు బౌలరు సాబ్‌జాన్‌బాషా ఐదు వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 45 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 215 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఇందులో తౌఫిక్‌హుసేన్ 41 పరుగులు, మనోజ్‌రాజ్ 66 పరు గులు చేశారు. దీంతో కడప జట్టు 21 రన్స్ తేడాతో విజయభేరి మోగించింది.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి

● స్కూటర్ దగ్ధం





ప్రమాదంలో దగ్ధమైన ద్విచక్రవాహనం, భాస్కరరావు (ఫైల్‌ఫొటో)

ఖాజీపేట/బద్వేలుటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో బుగ్గబోయిన భాస్కర్ (34) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం వల్లెవారిపల్లెకు చెందిన భాస్కర్ ప్రస్తుతం బద్వేలు పట్టణంలోని గౌరీ శంకర్‌నగర్ నివాసం ఉంటూ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాజీపేట మండలం అగ్రహారంలో తన బంధువులు జాతరకు ఆహ్వానించగా.. భాస్కర్ శనివారం రాత్రి 10 గంటలకు బద్వేలు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఖాజీపేట సమీపంలో పత్తూరు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో మంటలు చెలరేగి ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రధాన రహదారిపై పడి మృతి చెందిన భాస్కర్‌పై పలు వాహనాలు వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. ఆదివారం తెల్లవారు జామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలపై ఆరా తీశారు. ద్విచక్రవాహనం నెంబర్‌ప్లేట్ ఆధారంగా బద్వేలు పట్టణ వాసి భాస్కర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నటు సీఐ మోహన్ తెలిపారు.

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య



మృతురాలు భాగ్యమ్మ

రామసముద్రం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్ క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన తుమ్మల వెంకటరమణ కుమార్తె భాగ్యమ్మ(35)కు గుర్రంకొండ మండలంలోని లక్కువారిపల్లెకు చెందిన మల్లికార్జునతో వివాహమైంది. అయితే భార్యాభర్తలిద్దరికీ మనస్పర్థలు రావడంతో ఎనిమిదేళ్ల క్రితం భాగ్యమ్మ పుట్టింటికి వచ్చేసింది. పిల్లలు పుట్టకపోవడం, భర్తను వదిలి రావడం వంటి కారణాలతో ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉండేది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం యాసిడ్ తాగి అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పఠాన్ వాహిద అనే మహిళ అదృశ్యమైందని సీఐ నరసింహులు తెలిపారు. స్థానిక ఉర్దూ షాదీఖానా సమీపంలో నివశిస్తున్న వాహిద గత నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో, చుట్టుపక్కల వెతికినా కని పించలేదు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

మోటార్‌బైకు ఢీ... మహిళ మృతి



సరోజమ్మ మృతదేహం

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (69) అనే మహిళ మృతి చెందింది. ఈమె ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి సతీమణి. ఈమె వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో గాయపడింది. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు/ ప్రొద్దుటూరు టౌన్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రగతి మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఎస్ఈ సానా వెంకటవీంద్రవర్మ పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరచిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురష్కారాలను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ2,500, కన్సోలేషన్ బహుమతులు రూ.1500, మెమొంటో, సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 115 మంది విద్యార్థులకు రూ.3.25 లక్షలు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన తొగటవీర క్షత్రియ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గత 13 సంవత్సరాలుగా విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురష్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్, బీటెక్, మెడిసిన్, ఇతర ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పట్టుపోగుల నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, జాయింట్ సెక్రటరి వెంకటనారాయణ, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో...

ప్రొద్దుటూరులో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులతో పాటు నగదు పురస్కారం అందజేసే కార్యక్రమం చేపట్టారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, కన్సొలేషన్ కింద రూ.3వేలు చొప్పున 76 మంది విద్యార్థులకు రూ.3.20 లక్షలు అందజేశారు. ఈ సభకు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాం జనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కదిరి ఎమ్మెల్యే



మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమాజంలో డబ్బు, పదవి, స్థాయి అనేవి సాధించినప్పుడే అతని మాటలకు విలువనిస్తారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ మార్కులు అంటే జీవితం కాదన్నారు. సరైన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, చౌడం జొల్లు కొండయ్య, రిటైర్డ్ విద్యుత్ ఎస్ఈ బత్తల వెంకట సుబ్బయ్య మాట్లాడారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి చాబోలు దేవేంద్రుడు, కోశాధికారి సంటెయ్య, కొత్తపల్లె శ్రీను, జీసీ పుల్లయ్య, భాస్కరరావు, దస్తగిరి, మల్లికార్జున, ఆదినారాయణ, బత్తల శ్రీను, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్యారమ్స్ పోటీలు



కడప స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ఇండోర్ స్టేడియంలో కడప క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ రాజీ, కోచ్ గణేశ్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్యారమ్స్ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈనెల 12 వరకు ప్రతిరోజూ ఉదయం 10గం టల నుంచి 12 వరకు క్యారమ్స్ పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది క్యారమ్స్ క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో అండర్-9 బాయ్స్ విభాగంలో గోకుల్, ఎం.మహేశ్వర్ సంయుక్త విజేతలుగా నిలిచారు. రన్నర్‌గా ఎస్.రుషి, అండర్-11 బాలుర విభాగంలో విన్నర్‌గా చరణ్‌సాయి, రన్నర్‌గా అడనాన్, అండర్-14 బాయ్స్ విభాగంలో రంగనాథ్ విన్నర్‌గా, చరణ్ సాయి రన్నర్ నిలిచారు. అలాగే బాలికల విభాగంలో ఎ.షణ్ము కప్రియ విన్నర్‌గా, ధరణి రన్నర్‌గా నిలిచారు. ఇక సీనియర్స్ మెన్ విభాగంలో నాగేంద్ర విన్నర్‌గా, మస్తాన్‌వలి రన్నర్‌గా, మహిళా విభాగంలో శ్రీదేవి విన్నర్‌గా.. రేణుక రన్నర్‌గా నిలిచారు.

ప్రవీణ్‌రెడ్డికి ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత కల్పించింది. ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ పార్టీ నాయకులతో ప్రవీణ్‌రెడ్డికి ప్రమాదం పొంచి ఉన్నందున ఇంటలిజెన్స్ నివేదిక మేరకు ఇద్దరు గన్‌మెన్‌లను కల్పించారు. ఆమేరకు ఆదివారం గన్‌మెన్‌లు విధుల్లో చేరినట్లు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే సమన్వయ అధికారి వీరయ్య

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనులో వరి సాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంభించాలని కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయ అధికారి డాక్టర్ వీరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రంపాడు, ఉప్పరపల్లె గ్రామాల్లో వికశిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. ఇందులో కేవీకే సమన్వయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై కూలంకుషంగా రైతులతో చర్చించారు. మంచి విత్తనం ఎంపిక, నీటి పారకం, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణ వంటి వాటిపై రైతులకు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎంఎం ఖురేషీ మాట్లాడుతూ నువ్వులు, వేరుశెనగ పంటల్లో పలు మేలైన రకాలు వాడడం, పాటించాల్సి సమయానుకూల యాజమాన్య పద్దతులను వివరించారు. ఉద్యాన విశ్వ విద్యాలయం ప్రొఫెసరు డాక్టర్ వెంకటసుబ్బయ్య మామిడిలో కోత దశ అనంతరం చేపట్టాల్సిన పనులపై వివరించారు. వ్యవసాయాధికారి శ్రీదేవి, ఆత్మ బీటీయం వెంకటరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అల్లుడిని దారుణంగా హత్య చేసిన మామ

● భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణమా... ● విచారిస్తున్న పోలీసులు



హత్యకు గురైన యువకుడు (ఫైల్)

కడప క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సొంత పిల్లనిచ్చిన మామే అల్లుడి పాలిట యముడయ్యాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా విసిగిపోయిన మామ చివరికి అల్లున్ని కడతేర్చిన ఘటన కడప నగరం చిన్నచౌకులోని అశోక్ నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రవికుమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని హత్య ఘటనను పరిశీలించారు. సీఐ, స్థానికుల వివరాల మేరకు..

కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ జుబేదా చిన్నకుమారుడు సయ్యద్ చాంద్‌బాషాకు అశోక్‌నగర్‌లోని మసీదు వీధిలో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్‌బాషా కుమార్తె ఆయేషాతో తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గు రు కుమారులు ఉన్నారు. చాంద్‌బాషా ఆటో డ్రైవర్‌గా, ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య ఆయేషా కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తుండేది. వివాహమైనప్పటి నుంచి అశోక్ నగర్‌లోనే తన అత్తగారింటి వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుండేవాడు. పెళ్లినాటి నుంచే భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చిలికి చిలికి గాలివానలా మారి పోలీసుస్టేషన్లలో కేసుల దాకా వెళ్లారు. గత ఆరు నెలల నుంచి ఆయేషా తన పుట్టింట్లోనే ఉంటూ పిల్లలను దగ్గర పెట్టుకుంది. ఈక్రమంలో పరస్పరం ఘర్షణ పడుతూనే ఉండేవారు. 20 రోజులక్రితం ఆయేషా తండ్రి షేక్ మహబూబ్ బాషా కువైట్ నుంచి వచ్చాడు. ఓసారి తన అల్లుడు చాంద్‌బాషాపై హత్యాయత్నానికి కూడా పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం చాంద్ బాషా తన తల్లి జుబేదాకు దావత్ ఉందని చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో మామ మహబూబ్ బాషా కూడా కుటుంబ సభ్యులతో కలిసి



రోదిస్తున్న మృతుడి బంధువులు

చాంద్‌బాషాను తమ ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి మచ్చు కొడవలితో దారుణంగా నరికి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉండగా ప్రధాన నిందితుడు షేక్ మహబూబ్‌బాష ఇతర కుటుంబ సభ్యులు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రవికుమార్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మామ, కుటుంబ సభ్యులే తన కుమారుని పొట్టనబెట్టుకున్నారంటూ మృతుని తల్లి జుబేదా రోదించింది. తన కుమారుని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. చిన్నచౌకు సీఐ అన్ని కోణాల్లో విచారి స్తున్నామని, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

● 1నుంచి 15వ తేదీ వరకు పంపిణీ

● జాయింట్ కలెక్టర్, కుడా చైర్మన్ ముక్కా, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

● ప్రారంభమైన రేషన్‌షాపుల వద్ద బియ్యం పంపిణీ



రైల్వేకోడూరు వీపీఆర్ కండ్రికలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెల ఇంటి వద్దకే సరుకుల పంపిణీ జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని వీపీఆర్ కండ్రిక గ్రామంలోని చౌకదుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. ప్రతి నెల 1 నుంచి 15 తేదీ వరకు రేషన్ షాపుల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, తహసీల్దార్ మహబూబ్ చాంద్, ఆర్‌ఐ లక్ష్మీదేవి, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

● ఆకేపాడులో ప్రారంభించిన ఎమ్మెల్యే

రాజంపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆకేపాడు గ్రామంలో ఆదివారం రేషన్‌షాపును రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు రేషన్ సక్రమంగా ఇస్తున్నారా లేదా తనిఖీలు చేపట్టి కార్డుదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. డీలర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే డీలర్‌షాపును రద్దు చేయాలని సూచించారు. అలాగే రాజంపేట మండలం భువనగిరిపల్లె గ్రామంలో చౌకదుకాణాన్ని కూటమి నాయకులు, గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వీ రమణ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసిల్దారు పీర్‌మున్నీ, డీలరు కె.నరసయ్య, కేఎస్ నరసింహా, కొ.సుబ్బనరసయ్య, కె.హరిక్రిష్ణ, బి.నాగరాజు, కె.నరేష్, కార్డుదారులు తదితరులు పాల్గొన్నారు.

● నందలూరులో..

నందలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చౌకదుకాణాల వద్దనే రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసిల్దారు పుల్లారెడ్డి, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎంపీటీసీలు భువనబోయిన పెంచలయ్య, శివయ్య, టీడీపీ నాయకులు ధనుంజయ్య నాయుడు, కానకుర్తి వెంకటయ్య, మట్టి బాబు, తదితరులు పాల్గొన్నారు.

● సిద్దవటంలో..

సిద్దవటం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్వతిపురం, ఎస్కేఆర్‌నగర్, ఆకురోపల్లె గ్రామాల్లో ఆదివారం కూటమి నేతలు నూతన చౌకదుకాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, రాజంపేట నియోజకవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రుడు, రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి గంజి సుబ్బ రాయుడు, వాణిజ్య పార్లమెంట్ అధికార ప్రతినిధి చంద్ర, మాజీ మండల ఉపాధ్యక్షుడు బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● సుండుపల్లెలో..

సుండుపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లబ్ధిదారులకు సకాలంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ ధైవాదీనం తెలిపారు. మండల కేంద్రంలోని రేషన్‌షాపును టీడీపీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయాల్లో బియ్యం పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, మేకల మహబూబ్‌బాషా, శివరాంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

● పెనగలూరులో..

పెనగలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల నుంచి ప్రజలకు బియ్యం తదితర నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆదివారం తహశిల్దారు అమరేశ్వరి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు లాంచనంగా ప్రారంభించారు. పెనగలూరు పంచాయతీలోని 4, 5, 6 రేషన్ షాపుల ప్రారంభోత్సవంలో బీఎల్ నరసింహారెడ్డి, కె.బాలక్రిష్ణ, ఎన్.రాంప్రసాద్ నాయుడు, జి.రామయ్య, పున్నాటి వాసుదేవరెడ్డి, ఎ.చిన్నా, జి.పెంచలయ్య, జీఎంఆర్, పి.వెంకటరమణ, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

● ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓరంపాడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న రేషన్ షాపును ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, మండల డీలర్ల సంఘం నాయకులు ఎంఎల్ నారాయణరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని బాలిరెడ్డిపల్లె, బొమ్మవరం, ఓబులవారిపల్లె తదితర గ్రామాల్లో ఉన్న అన్ని చౌకదుకాణాలు ప్రారంభించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డీటీ సదాశివ, ఆర్‌ఐ రామ్మోహన్, సర్పంచ్ తనయుడు గద్దె పెంచలయ్య, నాయకులు నాగ శివశంకర్‌రెడ్డి, పయ్యావుల కోటేశ్వర్‌రావు, నాగినేని రమేష్ నాయుడు, ఈశ్వర్‌నాయుడు, కేపీ నరసింహారెడ్డి, ముక్కా హరిప్రకాష్‌రెడ్డి, గజేంద్ర పాల్గొన్నారు.

● ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని చౌకదుకాణాల్లో ఆదివారం నుంచి సరకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సాలాబాదు దుకాణాన్ని ఎంపీపీ లక్ష్మీదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు కుమారి శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మౌలాలి, చౌడయ్య, ఏవీ సుబ్బారెడ్డి, క్రిష్ణారెడ్డి, చింతగింజల సుబ్రమణ్యం, బొమ్మ శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, చౌకదుకాణం డీలరు, ప్రజలు పాల్గొన్నారు.

● చిట్వేలిలో..

చిట్వేలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వారు చిట్వేలిలో నూతన రేషన్‌షాపును ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాయచోటిలో..

రాయచోటిటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపల్లి చౌకదుకాణంలో రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకులను టీడీపీ కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు అన్వర్, నిస్సార్, సికిందర్ బేగ్, ఇర్షాద్, రేషన్ షాపుల డీలర్లు బషీర్, అల్లబకష్ తదితరులు పాల్గొన్నారు.

● రామాపురంలో..

రామాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసిరెడ్డిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె రేషన్ షాప్‌ను తహసీల్దార్ రామాంజనేయులు ఆదివారం ప్రారంభించారు. చౌకదుకాణ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలన్నారు. ఎఫ్‌పీ షాపు నెంబర్, పనివేళలు, ధరలు, సరుకు నిల్వను సూచించే బోర్డును తప్పనిసరిగా నోటీసుబోర్డులో పెట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత చిట్టి రామసుబ్బయ్య పాల్గొన్నారు.

● గాలివీడులో..

గాలివీడు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం రేషన్‌షాపుల దగ్గరే నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డితో కలిసి రేషన్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి లబ్ధిదారులకు సరుకులను అందజేయాలని సూచించారు.

● రేషన్ దుకాణాలకు పూర్వ వైభవం

రాజంపేట టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ దుకాణాలకు పూర్వ వైభవం వచ్చిందని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ అన్నారు. ఆదివారం రాజంపేట మండల వ్యాప్తంగా చౌక దుకాణాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు నాణ్యమైన ప్రజా పంపి ణీ వ్యవస్థతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం హస్తవరం, చెర్లోపల్లె, వైబీఎన్‌పల్లె, నూనెవారిపల్లె, అమ్మవారిశాల, రాజీవ్‌నగర్, మన్నూరు పలు ప్రాంతాల్లో చౌక దుకాణాలను రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజు, ఇన్‌చార్జి తహసిల్దారు పీర్‌మున్నీ, టీఎన్‌ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, టీడీపీ సీనియర్ నాయకుడు మలిశెట్టి సుబ్బరాయుడు, మాజీ మండల అధ్యక్షుడు బాపనయ్యనాయుడు, తేజాల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

సీఎం సహాయనిధి పేదలకు వరం : కుప్పాల



బాధితుడికి చెక్కును అందిస్తున్న కుప్పాల, టీడీపీ నాయకులు

సిద్దవటం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిది పేదలకు వరం లాంటిదని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ నిర్మలగిరి కాలనీలో నివాసం ఉన్న గంపాల రాయుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య చొరవతో సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.50వేల చెక్కును ఆదివారం బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పులి బాలయ్య, గ్రామ కమిటీ సభ్యులు పల్లె సుబ్బరాయుడు, చాపాటి వెంకటసుబ్బారెడ్డి, గాలి పెద్ద సుబ్బయ్య, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రైల్వేకోడూరు, జూన్ 1(ఆం ధ్రజ్యోతి): పేదలకు ముఖ్య మంత్రి సహాయనిధి వరం లాందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని వెంకటరెడ్డిపల్లెకు చెందిన నూకా రోహిత్‌కుమార్‌రెడ్డికి రూ.2.51లక్షలు, నాగోల కుతలమ్మకు రూ.37,100 చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైకోలు మారలేదు : టీడీపీ

సిద్దవటం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సైకో రాజకీయాలు వద్దని ప్రజలు తీర్పునిచ్చినా వైసీపీ తీరులో మాత్రం మార్పు రాలేదని టీడీపీ సీనియర్ నేత పుత్తా బాబు అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు మహానాడుకు భారీగా తరలివస్తే వైసీపీ సైకోలు దగా మహానాడు అనడం సిగ్గుచేటు అన్నారు. ఇబ్రహీంపేటలో ఒక పిల్లవాడు సైకిల్ తొక్కుకుంటూ పోతుంటే సైకిల్ లాక్కొని వారి వికృతరూపాన్ని ప్రదర్శించారని, పిల్లవాడు సైకిల్ ఇవ్వాలని బతిమాలినా ఏమాత్రం పట్టించుకోకుండా పైశాచికానందం పొందారని మండిపడ్డారు. ఇకనైనా మీ ప్రవర్తన మార్చుకోకుంటే ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

పనిచేసిన వారికి ఇన్‌చార్జి పదవి ఇవ్వాలి

● టీడీపీ నేతల డిమాండ్

సుండుపల్లె, జూన్1(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం క్రియాశీలకంగా కష్టపడి పనిచేసిన వారికి, దమ్మున్న వ్యక్తికి రాజంపేట ఇన్‌చార్జి పదవి కేటాయించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుండుపల్లెలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి, పార్లమెంటు టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ సిద్దవటం, ఒంటిమిట్ట, రాజంపేట, సుండుపల్లె మండలాలకు చెందిన టీడీపీ నేతలతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించినా రాజంపేట నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. కొంతమంది తామే ఇన్‌చార్జిలమని సోషల్ మీడియాలో, పత్రికల్లో ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. ఎవరికంటే వారికి ఇన్‌చార్జి పదవి కేటాయిస్తే నియోజకవర్గంలో పార్టీకి తీరని నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సుండుపల్లె మైనార్టీ నేత చాన్‌బాషా, ఒంటిమిట్ట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పుత్తా రామచంద్రయ్య, పార్లమెంట్ పద్మశాలి కన్వీనర్ వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య, ఒంటిమిట్ట బీసీ సెల్ నేత ఆలూరి ప్రసాద్, సిద్దవటం టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి శివానంద, బీసీ నేత శివశంకర్‌గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగులుకొని గేదె మృతి

లక్కిరెడ్డిపల్లె, జూన్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుళారం పంచాయతీ దళితవాడ సమీపంలోని పొలంలో విద్యుత్ వైర్లు తగులుకుని గేదె మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుకుంది. రైతు వంగిమళ్ల సుబ్బరాయుడుకు చెందిన గేదెలు మేత మేస్తుండగా రెండు స్తంభాల మధ్య విద్యుత్ వైర్లు తెగి కిందపడిపోవడంతో కాలికి తగులుకొని మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారులు సక్రమంగా వైర్లు అమర్చకపోవడంతో గాలికి కిందపడి తన గేదె మృతి చందిందని రైతు వాపోయాడు. గేదె సుమారు రోజుకు 12 లీటర్ల పాలు ఇచ్చేదని, గేదె మృతితో జీవనోపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

21 మందికి కంటి ఆపరేషన్లు



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన వైద్యశిబిరంలో 21మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, కేవీపల్లి, కలకడ, కలికిరి, చక్రాయపేట, ఎన్‌పీకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 40 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అర్హులైన 21 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్నవారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు. అనంతరం కంటి వైద్యశిబిరానికి హాజరైనవారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

రైల్వేకోడూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సిల్వర్ బెల్స్ స్కూలులో ఆదివారం వాసవి, వనితా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 500 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన 15 మంది వైద్యులు ఈ శిబిరంలో సేవలందించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సీనియర్ ప్రతినిధి పెండ్యాల విజయ్‌కుమార్, వాసవి క్లబ్ అధ్యక్షుడు తిరునామాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కలువా సోమశేఖర్, కోశాధికారి టంగుటూరి దశరథ, వనితా క్లబ్ అధ్యక్షురాలు తిరునామాల లీలావతి, ప్రధాన కార్యదర్శి పద్మావతి, కోశాధికారి బైసాని చైతన్య తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ పోసిన భర్తకు రిమాండ్

సిద్దవటం, సిద్దవటం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తాళి కట్టిన భార్య జుబేదా శరీరంపై భర్త ఎస్కే లాల్ మస్తాన్ ఈనెల 29వ తేదీన యాసిడ్ పోయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. పోలీసులు భర్తను అదుపులోకి తీసుకొని విచారించి కేసు నమోదు చేశారు. ఆదివారం కడప కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.

దండు మారెమ్మకు అభిషేకం, ప్రత్యేక పూజలు

సుండుపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దండు మారెమ్మ జాతర సందర్భంగా మండలంలోని బాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటల ముందరలో వెలసిన దండు మారెమ్మకు ఆదివారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం రాత్రి జాగారం నిర్వహించడంతో పాటు ఆదివారం ఉదయం అమ్మవారికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించడం జరిగిందన్నారు. ఆదివారం రాత్రి సోమవారం తెల్లవారుజామున రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులతో చాందినీ బండ్ల దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

గంగమ్మ తల్లికి పొంగుబాళ్లు



గంగమ్మతల్లికి పొంగుబాళ్లు తీసుకెళుతున్న మహిళలు

నందలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపల్లె గ్రామం గంగమిట్టలో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం ఘనంగా పొంగుబాళ్లు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగుబాళ్లను ఊరేగింపుగా అమ్మవారివద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మారమ్మ జాతరకు ముందుగా గంగమ్మకు పొంగుబాళ్లు పెట్టడం అక్కడి ప్రజల ఆనవాయితీ. ఈనెల 6, 7, 8వ తేదీల్లో మారమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ముగిసిన మహంకాళీ అమ్మవారి జాతర

పెనగలూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లె గ్రామంలో ఆదివారం గ్రామదేవత ఉజ్జయిని మహంకాళీ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. గ్రామ ప్రజలు ఏర్పాటు చేసిన విందు భోజనాలతో బెస్తపల్లె గ్రామం ప్రతి ఇల్లు బంధుమిత్రులతో కళకళలాడింది. ఇదిలా ఉండగా పెనగలూరు గ్రామంలో రేణుకా ఎల్లమ్మకు వైభవంగా పొంగళ్ల కార్యక్రమం జరిగింది. రాత్రి ఆసాది కథ తెల్లవారుజామున బలిచాట, ఊరేగింపు తర్వాత దేవాలయంలో ముద్ద పెట్టుకోవడం, కోడిపుంజులు, పొట్టేళ్లు వంటి జంతుబలులను ఇచ్చారు.

అనంతరాజుపేటలో సత్యమ్మ తల్లి జాతర

రైల్వేకోడూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తంబిళ్లవారిపల్లె గ్రామంలో ఆదివారం సత్యమ్మతల్లి జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమం లో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని ప్రభుత్వం

● వెన్నుపోటు దినం పోస్టర్ల ఆవిష్కరణలో వైసీపీ నేతలు

రాయచోటిటౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ఎండగడుతూ ఈనెల 4వ తేదీ చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసీపీ నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేసినప్పటికీ ఏ ఒక్క సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయలేదని, అప్పులు చేసిన డబ్బులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించారు. వైసీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్‌బాషా మాట్లాడుతూ 4న వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు షబ్బీర్, రియాజ్, కొలిమి చాన్‌బాషా, అల్తాఫ్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యాంకుమార్, అన్నా సలీం, గౌస్‌ఖాన్, మేధావుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు జానం రవీంద్రయాదవ్, కోఆప్షన్ సభ్యులు అయ్యవారురెడ్డి, అమీర్, నాగేంద్ర, మణికంఠరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ జాతర

వీరబల్లి, జూన్1(ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న యల్లమ్మ తల్లి జాతర ఆదివారం ముగిసింది. జాతర సందర్భంగా పల్లెలన్నీ భక్తజనంతో కిక్కిరిశాయి. యల్లమ్మ తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో జీవించాలని స్థానిక వీఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, సిగిరిగి కుళాయిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. జాతరను విజయవంతం చేయడానికి యల్లమ్మ తల్లి కమిటీ సభ్యులు శక్తివంచన లేకుండా కష్టపడ్డారని అభినందనలు తెలిపారు.

టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఓబులవారిపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్లో 1999-2024 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి వారి జ్ఞాపకాలను ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. తమ దగ్గర చదివిన విద్యార్థులు వివిధ స్థాయిల్లో ఉండడం గర్వకారణమని ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు కంచర్ల లోకేష్, మస్తాన్, శివ, దిలీప్, షఫీ, రఫీ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం ఉన్నా.. ఉపయోగం సున్నా..



చిట్వేలి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం ఉన్నా ఉపయోగం సున్నా అన్న చందంగా తయారైంది చిట్వేలి పరిస్థితి. తరచూ మొరాయిస్తూ ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటీఎంలు ఉన్నా ఉపయోగం లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏరోజు పనిచేస్తాయో తెలియక అల్లాడుతున్నారు. ప్రధానంగా ఉన్న చిట్వేలి స్టేట్‌బ్యాంకు ఏటీఎం మూడు నెలల నుంచి పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నగదు అత్యవసర ఖాతాదారులు స్థానికంగా కొంతమంది వ్యాపారుల దగ్గరకు వెళ్లి వెయ్యికి రూ.20 నుంచి రూ.30 వరకు చెల్లించి తీసుకోవడం, లేక వారి ఫోన్‌పేలో వేయించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిట్వేలిలో మూడు బ్యాంకులు ఉన్నప్పటికీ వసతులు మాత్రం అంతంత మాత్రమేనని ఖాతాదారులు విమర్శిస్తున్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఏటీఎంల దుస్థితి దయనీయంగా ఉందని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల అవస్థలను గుర్తించి మరికొన్ని బ్యాంకు సేవలను చిట్వేలి ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డగోలుగా వెంచర్లు

● పంచాయతీల ఆదాయానికి గండి ● అనుమతుల మంజూరులో అధికారుల చేతివాటం


వెల్లటూరు గ్రామ పరిధిలో వేసిన వెంచర్

పెండ్లిమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో కూడా ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటూ సకల వసతులతో గృహాలు నిర్మించుకుంటున్నారు. అలాగే పట్టణాలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో పల్లెల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని కడప-పులి వెందుల ప్రధాన రహదారి వెంబడి పుట్టగొడుగుల్లా లేఔట్లు పుట్టుకొస్తున్నాయి. నిన్నటి దాకా పంట పొలాలతో కళకళలాడిన భూములు ఇప్పుడు వెంచర్లుగా మారి సరిహద్దులు రంగురాళ్లతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి నివాస ప్రాంతాల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రాంతాన్ని బట్టి కనీసం సెంటు రూ.3లక్షల నుంచి గరిష్టంగా రూ.10లక్షల వరకు ధర పలుకుతోంది.

పంచాయతీల అనుమతి తప్పనిసరి

మండల పరిధిలో ఎక్కడైనా ఒక లేఔట్ వేయాలంటే గ్రామపంచాయతీ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. రంపతాడు, మొయిళ్లకాల్వ, తిప్పిరెడ్డిపల్లె, వెల్లటూరు, పాతసంగటిపల్లె, నందిమండలం, పెండ్లిమర్రి గ్రామాల పరిధిలో ఎక్కువగా లేఔట్లు వెలిశాయి. దాదాపు మూడు వందల ఎకరాల్లో వెంచర్లు వేశారు. నిబంధనల ప్రకారం లేఔట్లో రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్, గ్రీనరీ, కమ్యూనిటి హాలు, పార్థన మందిరాలకు స్థలాలు కేటాయించాలి. వీటన్నింటికి పంచాయతీ తీర్మానం అవసరం. వీటన్నింటికి కలిపి పంచాయతీకి డబ్బులు చెల్లించాలి. వాటి ద్వారా వచ్చిన నిధులను గ్రామ పంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవాలి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే రియల్టర్లు పంచాయతీలకు చెల్లించాల్సిన డబ్బులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు చెల్లిస్తున్నారు. ఆ కార్యదర్శులకు డబ్బులే కాక వెంచర్లలో ప్లాట్లను బహుమతులుగా పొందుతున్నారు. ఏ పంచాయతీలో కూడా ఈ నిధులను ఖర్చు చేసిన పాపాన పోలేదు.

అధికారుల చేతివాటం

మండలాల్లో లేఔట్లు వేయాలంటే పంచాయతీ తీర్మానాలతో పాటు, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. వ్యవసాయ భూములు కావడంతో ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. కడప నగరం దినదినాభివృద్ధి చెందడంతో నగరానికి చుట్టుపక్కల ఉన్న మండలాల్లో భూములకు విలువ అమాంతం పెరిగింది. దీంతో మండ లంలో ఎక్కడ పడితే అక్కడ ఇష్టాను సారంగా అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే ఇబ్బడిముబ్బడిగా రియల్టర్లు అధికారులను మేనేజ్ చేసి వెంచర్లు వేసారు. అనుమతులు లేని ప్లాట్లను కొనుగోలు చేసి జనం మోసపోతున్నారు. వెల్లటూరు పంచాయతీలోనే రూ.10,57,827లు దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇక అనధికారికంగా దాదాపు రూ.65లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. ఇక రంపతాడు, మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలలో ఈ లేఔట్ల ద్వారా వచ్చిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. ఈ పంచాయతీ నిధుల గోల్‌మాల్ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా.. అది ఈఓపీ ఆర్‌డీ పరిధిలో ఉంటుందన్నారు. ఇక మండలానికి రెగ్యులర్ ఈఓపీఆర్‌డీ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ను వివరణ అడగ్గా సమాచార హక్కు చట్టం ద్వారా అయితేనే వివరాలు చెబుతాం అని తెలిపారు. ఈ లేఔట్లు ఉన్న గ్రామ పంచాయతీలలో విచారణ జరిపితే భారీ అక్రమాలు బయట పడుతాయని స్థానికులు చెబుతున్నారు.

నెల్లూరు, కడప జట్ల విజయం


మన్విత్‌రెడ్డి, నెల్లూరు 109 పరుగులు


వాసుదేవరాజు (కడప) 99 పరుగులు

కడప స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం వివిధ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో, కడప జట్టు 21 రన్స్ తేడాతో ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. వివరాలిలా..

కేఎస్ఆర్ఎం మైదానంలో అనంతపురం - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 49 ఓవర్లలో 230 పరు గులకు ఆలౌట్ అయింది. ఇందులో వీరారెడ్డి 47 పరుగులు, వికాస్ 42 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో మన్విత్‌రెడ్డి 109 పరుగులు చేయడం విశేషం. దీంతో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో విజయభేరి మోగించినట్లయింది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య మరో మ్యాచ్ జరిగింది. ఇందులో టాస్‌నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 45 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. ఇందులో వాసుదేవరాజు 99 పరుగులు సాధించి. ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ అయ్యాడు. మరో బ్యాట్స్‌మెన్ విజయరామిరెడ్డి 61 పరుగులు సాధించి భారీ స్కోరుకు బాటలు వేశారు. ఇక బౌలింగ్ విభాగంలో కర్నూలు జట్టు బౌలరు సాబ్‌జాన్‌బాషా ఐదు వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 45 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 215 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఇందులో తౌఫిక్‌హుసేన్ 41 పరుగులు, మనోజ్‌రాజ్ 66 పరు గులు చేశారు. దీంతో కడప జట్టు 21 రన్స్ తేడాతో విజయభేరి మోగించింది.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

పీలేరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం సోమవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. ఆదివారం ఆయన పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యద ర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉదయం 10. 30 గంటల నుంచి పీలేరు పట్టణం కడప మార్గంలోని యల్లమంద క్రాస్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా మార్కెట్ కమిటీ వరకూ భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం 10 గంటలకు చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ప్రమాణా స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెడ్డెమ్మకు పూజలు



గుర్రంకొండ, జూన్ 1 (ఆంధ్ర జ్యోతి): సంతానలక్ష్మిగా ప్రసిద్ధి చెందిన రె డ్డెమ్మ కొండ ఆలయంలో ఆ దివారం అమ్మ వారికి అర్చకులు పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి అర్చన, పంచామృతాభి షేకం చేశారు. అనంతరం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆకు పసురును తాగి తడిబట్టలతో ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కోర్టులో గంగమ్మ జాతర

మదనపల్లె అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):స్థానిక కోర్టు ఆవరణలో ఉన్న గంగమ్మ అమ్మవారి జాతరను ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించను న్నారు. అన్నమయ్య జిల్లాలో నిర్వహించే అతి పెద్ద జాతరల్లో కోర్టులో గంగమ్మ జాతర ఒకటి. సుమారు వందేళ్ల క్రితం గంగమ్మ ఆలయం ఇక్క డ వెలసింది. మదనపల్లె పట్టణంలోని అమ్మినేని వీధి, రామాలయం సమీపం తదితర ఏడు చోట్ల గంగమ్మలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించే వారు. అదే క్రమంలో కోర్టు ఆవరణలో గంగమ్మను ఏర్పాటు చేసుకుని జాతర నిర్వహించేవారు. ఏడు చోట్ల ఉన్న గంగమ్మకు పూజలు నిర్వహిం చిన అనంతరం కోర్టులో గంగమ్మను ప్రతిష్ఠించడం ఆనవాయితీ. కోర్టు ఆవరణంలో ఆలయం నిర్మించారు .ప్రతి ఏటా రెండు రోజుల పాటు జాతర నిర్వహించి, గంగమ్మను ప్రతిష్ఠించి రెండు రోజులు పూజలు చేసి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి జలధికి చేర్చడంతో జాతర ముగుస్తుంది. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు తదితరులు పర్యవేక్షిస్తారు.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి

● స్కూటర్ దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన ద్విచక్రవాహనం, భాస్కరరావు (ఫైల్‌ఫొటో)

ఖాజీపేట/బద్వేలుటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో బుగ్గబోయిన భాస్కర్ (34) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం వల్లెవారిపల్లెకు చెందిన భాస్కర్ ప్రస్తుతం బద్వేలు పట్టణంలోని గౌరీ శంకర్‌నగర్ నివాసం ఉంటూ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాజీపేట మండలం అగ్రహారంలో తన బంధువులు జాతరకు ఆహ్వానించగా.. భాస్కర్ శనివారం రాత్రి 10 గంటలకు బద్వేలు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఖాజీపేట సమీపంలో పత్తూరు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో మంటలు చెలరేగి ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రధాన రహదారిపై పడి మృతి చెందిన భాస్కర్‌పై పలు వాహనాలు వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. ఆదివారం తెల్లవారు జామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలపై ఆరా తీశారు. ద్విచక్రవాహనం నెంబర్‌ప్లేట్ ఆధారంగా బద్వేలు పట్టణ వాసి భాస్కర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నటు సీఐ మోహన్ తెలిపారు.

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య


మృతురాలు భాగ్యమ్మ

రామసముద్రం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్ క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన తుమ్మల వెంకటరమణ కుమార్తె భాగ్యమ్మ(35)కు గుర్రంకొండ మండలంలోని లక్కవారిపల్లెకు చెందిన మల్లికార్జునతో వివాహమైంది. అయితే భార్యాభర్తలిద్దరికీ మనస్పర్థలు రావడంతో ఎనిమిదేళ్ల క్రితం భాగ్యమ్మ పుట్టింటికి వచ్చేసింది. పిల్లలు పుట్టకపోవడం, భర్తను వదిలి రావడం వంటి కారణాలతో ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉండేది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం యాసిడ్ తాగి అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పఠాన్ వాహిద అనే మహిళ అదృశ్యమైందని సీఐ నరసింహులు తెలిపారు. స్థానిక ఉర్దూ షాదీఖానా సమీపంలో నివశిస్తున్న వాహిద గత నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో, చుట్టుపక్కల వెతికినా కని పించలేదు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

మోటార్‌బైకు ఢీ... మహిళ మృతి


సరోజమ్మ మృతదేహం

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (69) అనే మహిళ మృతి చెందింది. ఈమె ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి సతీమణి. ఈమె వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో గాయపడింది. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు/ ప్రొద్దుటూరు టౌన్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రగతి మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఎస్ఈ సానా వెంకటరవీంద్రవర్మ పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరచిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురష్కారాలను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ2,500, కన్సోలేషన్ బహుమతులు రూ.1500, మెమోంటో, సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 115 మంది విద్యార్థులకు రూ.3.25 లక్షలు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన తొగటవీర క్షత్రియ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు సహకారంతో గత 13 సంవత్సరాలుగా విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురష్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్, బీటెక్, మెడిసిన్, ఇతర ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు పట్టుపోగుల నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, జాయింట్ సెక్రటరి పల్లా వెంకటనారాయణ, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో


మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

ప్రొద్దుటూరులో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులతో పాటు నగదు పురస్కారం అందజేసే కార్యక్రమం చేపట్టారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, కన్సొలేషన్ కింద రూ.3వేలు చొప్పున 76 మంది విద్యార్థులకు రూ.3.20 లక్షలు అందజేశారు. ఈ సభకు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాం జనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమాజంలో డబ్బు, పదవి, స్థాయి అనేవి సాధించినప్పుడే అతని మాటలకు విలువ నిస్తారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ మార్కులు అంటే జీవితం కాదన్నారు. సరైన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, చౌడం జొల్లు కొండయ్య, రిటైర్డ్ విద్యుత్ ఎస్ఈ బత్తల వెంకట సుబ్బయ్య మాట్లాడారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి చాబోలు దేవేంద్రుడు, కోశాధికారి సంటెయ్య, కొత్తపల్లె శ్రీను, జీసీ పుల్లయ్య, బాస్కరరావు, దస్తగిరి, మల్లికార్జున, ఆదినారాయణ, బత్తల శ్రీను, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన క్యారమ్స్ పోటీలు



కడప స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ఇండోర్ స్టేడియంలో కడప క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ రాజీ, కోచ్ గణేశ్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్యారమ్స్ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈనెల 12 వరకు ప్రతిరోజూ ఉదయం 10గం టల నుంచి 12 వరకు క్యారమ్స్ పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది క్యారమ్స్ క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో అండర్-9 బాయ్స్ విభాగంలో గోకుల్, ఎం.మహేశ్వర్ సంయుక్త విజేతలుగా నిలిచారు. రన్నర్‌గా ఎస్.రుషి, అండర్-11 బాలుర విభాగంలో విన్నర్‌గా చరణ్‌సాయి, రన్నర్‌గా అడనాన్, అండర్-14 బాయ్స్ విభాగంలో రంగనాథ్ విన్నర్‌గా, చరణ్ సాయి రన్నర్ నిలిచారు. అలాగే బాలికల విభాగంలో ఎ.షణ్ము కప్రియ విన్నర్‌గా, ధరణి రన్నర్‌గా నిలిచారు. ఇక సీనియర్స్ మెన్ విభాగంలో నాగేంద్ర విన్నర్‌గా, మస్తాన్‌వలి రన్నర్‌గా, మహిళా విభాగంలో శ్రీదేవి విన్నర్‌గా.. రేణుక రన్నర్‌గా నిలిచారు.

ప్రవీణ్‌రెడ్డికి ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత కల్పించింది. ప్రొద్దుటూరులోని వైఎస్ఆర్ పార్టీ నాయకులతో ప్రవీణ్‌రెడ్డికి ప్రమాదం పొంచి ఉన్నందున ఇంటలిజెన్స్ నివేదిక మేరకు ఇద్దరు గన్‌మెన్‌లను కల్పించారు. ఆమేరకు ఆదివారం గన్‌మెన్‌లు విధుల్లో చేరినట్లు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధికదిగుబడులు


మాట్లాడుతున్న కేవీకే సమన్వయ అధికారి వీరయ్య

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనులో వరిసాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంభించాలని కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయ అధికారి డాక్టర్ వీరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రంపాడు, ఉప్పరపల్లె గ్రామాల్లో వికశిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. ఇందులో కేవీకే సమన్వయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై కూలంకుషంగా రైతులతో చర్చించారు. మంచి విత్తనం ఎంపిక, నీటి పారకం, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణ వంటి వాటిపై రైతులకు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎంఎం ఖురేషీ మాట్లాడుతూ నువ్వులు, వేరుశెనగ పంటల్లో పలు మేలైన రకాలు వాడడం, పాటించాల్సి సమయానుకూల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఉద్యాన విశ్వ విద్యాలయం ప్రొఫెసరు డాక్టర్ వెంకటసుబ్బయ్య మామిడిలో కోత దశ అనంతరం చేపట్టాల్సిన పనులపై వివరించారు. వ్యవసాయాధికారి శ్రీదేవి, ఆత్మ బీటీయం వెంకటరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

అల్లుడిని దారుణంగా హత్య చేసిన మామ

● భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణమా... ● విచారిస్తున్న పోలీసులు


హత్యకు గురైన యువకుడు (ఫైల్)


రోదిస్తున్న మృతుడి బంధువులు

కడప క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సొంత పిల్లనిచ్చిన మామే అల్లుడి పాలిట యముడయ్యాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా విసిగిపోయిన మామ చివరికి అల్లున్ని కడతేర్చిన ఘటన కడప నగరం చిన్నచౌకులోని అశోక్ నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రవికుమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని హత్య ఘటనను పరిశీలించారు. సీఐ, స్థానికుల వివరాల మేరకు..

కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ జుబేదా చిన్నకుమారుడు సయ్యద్ చాంద్‌బాషాకు అశోక్‌నగర్‌లోని మసీదు వీధిలో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్‌బాషా కుమార్తె ఆయేషాతో తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గు రు కుమారులు ఉన్నారు. చాంద్‌బాషా ఆటో డ్రైవర్‌గా, ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య ఆయేషా కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తుండేది. వివాహమైనప్పటి నుంచి అశోక్ నగర్‌లోనే తన అత్తగారింటి వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుండేవాడు. పెళ్లినాటి నుంచే భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చిలికి చిలికి గాలివానలా మారి పోలీసుస్టేషన్లలో కేసుల దాకా వెళ్లారు. గత ఆరు నెలల నుంచి ఆయేషా తన పుట్టింట్లోనే ఉంటూ పిల్లలను దగ్గర పెటుకుంది. ఈక్రమంలో పరస్పరం ఘర్షణ పడుతూనే ఉండేవారు. 20 రోజులక్రితం ఆయేషా తండ్రి షేక్ మహబూబ్ బాషా కువైట్ నుంచి వచ్చాడు. ఓసారి తన అల్లుడు చాంద్‌బాషాపై హత్యాయత్నానికి కూడా పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం చాంద్‌బాషా తన తల్లి జుబేదాకు దావత్ ఉందని చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో మామ మహబూబ్ బాషా కూడా కుటుంబ సభ్యులతో కలిసి చాంద్‌బాషాను తమ ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి మచ్చు కొడవలితో దారుణంగా నరికి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉండగా ప్రధాన నిందితుడు షేక్ మహబూబ్‌బాష ఇతర కుటుంబ సభ్యులు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్ఐ రవికుమార్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మామ, కుటుంబ సభ్యులే తన కుమారుని పొట్టనబెట్టుకున్నారంటూ మృతుని తల్లి జుబేదా రోదించింది. తన కుమారుని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. చిన్నచౌకు సీఐ అన్ని కోణాల్లో విచారి స్తున్నామని, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


బుగ్గకాలువలో కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా


చౌడసముద్రంలో సరుకులు పంపిణీ చేస్తున్న తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


పెద్దమండ్యం: వృద్ధురాలికి ఇంటివద్దే బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, నేతలు

రేషన్ షాపులకు పూర్వ వైభవం: ఎమ్మెల్యే

మదనపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాలకు పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్యే ఎం. షాజహాన్ బాషా అన్నారు. రేషన్ డీలర్ల వ్యవస్థకు సమాంతరంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం మరో వ్యవస్థను తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వం రాగానే ఆ వ్యవస్థకు తెర దించిందన్నారు. మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె మున్సిపాలిటీ, మదనపనల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో ఎమ్మెల్యే.. ఆదివారం రేషన్‌షాపులను పునఃప్రారంభించారు. అనంతరం కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా సుభాష్‌రోడ్డు, రాజీవ్‌నగర్, నీరుగట్టువారిపల్లె, అప్పారావుతోట, రామారావుకాలనీ, రామిరెడ్డి లేఅవుట్, పెంచుపాడు రోడ్డులోని బుగ్గకాలువ షాపుల్లో ఎమ్మెల్యే సరుకుల పంపిణీ ప్రారంభించారు. స్థానిక ఆర్‌వీ నాయుడువీధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు మాజీ కౌన్సిలర్ సాకే లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు గంగారపు నవీన్‌చౌదరి, మాకినేని చంద్రశేఖర్, పులకుంట్ల హరి, రామాంజనేయులు, పూల నాగరాజు, సాకే కృష్ణమూర్తి, ముత్తరాశి హరికృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్‌లోని దుకాణంలో డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మౌలాలి, మోతీనగర్ రేషన్ షాపులో 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఎస్.ఎ.నస్రీన్, ఎస్.ఎ.మస్తాన్, కె.హెచ్. ప్రశాంత్, తహసీల్దార్ ధనంజయులు, సీఎస్‌డీటీ నిమ్మనపల్లె ఫిరోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు. బసినికొండ పంచాయతీలోని బసినికొండ, రామచార్లపల్లె, గంగమ్మగుడి చౌకదుకాణాల్లో టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి రేషన్‌షాపులను ప్రారంభించారు.నటశేఖర్, నాగేంద్ర, రమణయ్యనాయుడు, శ్రీనివాసులు, నారాయణస్వామి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిమ్మనపలి : మండలంలోని రాచవేటివారిపల్లి గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే రేషన్ షాపును ప్రారంభించారు. జడ్పీ మాజీ కో-ఆప్షన్ మెంబరు సుధాకర్‌రావు తహసీల్దార్ అమరనాథ్ , ఏవో రమేశ్, డీలర్లు విజయ్, మల్లేశ్వర్‌రావు, నాయకులు రఫీ, రెడ్డెప్ప, అప్పోడు, చంద్ర, జగదీశ్, వీఆర్వో శ్రీనివాసులు. కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం/ములకల చెరువు: గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో పౌరసరఫరాల వ్యవస్థను జగన్‌మోహన్‌రెడ్డి సర్వనాశనం చేయ గా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే రేషన్ షాపులకు ప్రాణం పోశారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకుడు దాసరిపల్లె జయచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో రేషన్ షాపులను కూటమి నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ కార్డుదారులకు సరుకులను పారదర్శకంగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. రేషన్ డీలర్లు అవకతవలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. టీడీపీ నాయకులు కట్టా సురేంద్ర నాయుడు, స్థానిక సర్పంచ్ తమక శంకర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చిన్నా, స్కూల్ కమిటీ చైర్మన్ రాము, పోతుపేట సర్పంచ్ కళావతి చిన్నపరెడ్డి, మండల జనసేన అధ్య క్షుడు దొరిగుండ్ల శంకర, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ ఎంపీపీ నరసింహులు, నాయకులు చాంద్‌బాషా, రమణ తదితరులు పాల్గొన్నారు.

. తూకాలపై ఫిర్యాదులు రాకుండా చూసుకోండి...

బి.కొత్తకోట : రేషన్ షాపు డీలర్లు బియ్యం తూకాలపై ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని తహసీల్దార్ అజారుద్దీన్ డీలర్లను ఆదేశించారు. ఆదివారం మండల వ్యాప్తంగా 34 రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జనసేనను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తాం

● జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మై ఫోర్స్ మహేష్


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్

కురబలకోట, జూన్ 1(ఆంధ్రజ్యోతి) జనసేనను గ్రామస్థాయి నుంచి మరింతగా బలోపేతం చేస్తామని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మై ఫోర్స్ మహేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని ముదివేడు క్రాస్‌లో ఎద్దికూటి హరినాథ్, దామోదర్ ఆధ్వర్యంలో జనసేన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతి రహిత పాలన, పేదలకు న్యాయం చేయడానికే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుందని, ఎవరైనా సమస్యలు సృష్టిస్తే సహించేది లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులుగా పోటీ చేయాలన్నారు. పవన్‌ను సీఎం చేసేంతవరకు ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. త్వరలోనే జనసేన సభ్యత్వాలు ప్రారంభిస్తామని, ప్రతి ఒక్కరు సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షాకీర్‌భాషా, రెడ్డెప్ప, పఠాన్, మనోజ్, అంజి, రమేష్, శ్రీరాం, మహిళా నాయకులు మాలతీ రమేష్, జయభవ్య, సునీత, మల్లిక పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

పెద్దతిప్పసముద్రం జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు సస్యరక్షణ పద్ధతులు, శాస్త్రీయ విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మాధురి సూచించారు. ఆదివారం మండలంలోని బూర్లపల్లె సచివాలయంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. రైతులు వరి, వేరుశెనగలలో నూతన వంగడాలపై అవ గాహన పెంచుకోవాలన్నారు. వేరుశెనగలో విత్తనశుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా టమోటాలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, జీవన ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ కె. నవీన పొట్టేళ్ల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పెరటి కోళ్ల పెంపకానికి అనువైన రకాలు, లేగదూడల యాజమాన్యం, కట్టు నిలవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస రకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం. సుధాకర్‌రెడ్డి, పోతుపేట గ్రామసర్పంచ్ కళావతి చిన్నపరెడ్డి, రామకృష్ణ, వీఎస్‌ఏ బాబాజాన్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం

బి.కొత్తకోట జూన్ 1 (ఆంధ్రకజ్యోతి): అధిక మొత్తం ఆశ చూపి అమాయకుల నుంచి డబ్బులు కాజేసే ఓ కిలేడీ ఉదంతం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఆ యువతి మాయలో పడి రూ. 16 లక్షల దాకా పోగొట్టుకున్నానని పట్టణంలోని పీటీఎం రోడ్డుకు చెందిన రామ్మూర్తి (45) లబోదిబో మంటున్నాడు. ఆయన తెలిపిన వివరాల మేరకు మదనపల్లెకు చెందిన ఓ యువతి తిరుపతిలో నివాసం ఉంటూ, ఫైనాన్స్ అనే ప్లాట్‌ఫాంలో రూ.3.40 కోట్ల విలువైన బిట్ కాయిన్స్ తన ఖాతాలో ఉన్నాయని, నమ్మబలికింది. ఇందుకు సంబంధించి రూ. 45,00,000 ట్యాక్స్ చెల్లిస్తే మొత్తం డబ్బు తన చేతికి వస్తుందని, ఆ మొత్తం చెల్లించేందుకు సహకరిస్తే రెట్టింపు డబ్బు ఇస్తానని ఆశ చూపింది. తరచూ వాట్సప్‌లో చాటింగ్ చేసింది. దీంతో రామ్మూర్తి ఆమె బ్యాంకు అకౌంట్‌తో పాటు, ఆమె సూచించిన వివిధ అకౌంట్లకు పలు దఫాలుగా నగదును బదిలీ చేశాడు. కొన్ని రోజుల తర్వాత తన డబ్బును ఎప్పుడిస్తారని గట్టిగా అడగగా, నీ చేతనైంది చేసుకో అంటోందని వాపోయాడు. ఆ యువతి కోరినప్పుడల్లా డబ్బు చెల్లించానని, ఇందుకోసం తన భూమిని, తన భార్య నగలను తాకట్టు పెట్టానని చెబుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపాడు.

చెరువును పరిశీలించిన సాయి లోకేశ్


ఎర్ర కదిరినాయనిచెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకుడు సాయి లోకేశ్

మదనపల్లె, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్ర కదిరినాయని చెరువును ఆదివారం రాజంపేట పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ పరిశీలించారు. చెరువు దుస్థితికి కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంతో కాలంగా ఈ చెరువుకు మరమ్మతులు చేయకపోవడం, పూడిక తీయక పోవడం తో పిచ్చి మొక్కలు, ముళ్ళ కంపలతో నిండిపోయింది. తూములు, కాలువలు, అలుగులు పాడైపోయాయి. గట్టు కూడా బలహీన పడినట్లు గుర్తించారు. బండి ఆనంద్, శివయాదవ్, వెంకట రమణారెడ్డి, వాసు, నాగరాజు పాల్గొన్నారు.

కనుల పండువగా ద్రౌపదీ కల్యాణం


ద్రౌపది కల్యాణంలో నిర్వాహకులు

మదనపల్లె అర్బన్, జూన్1(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, టిప్పుసుల్తాన్ మైదానంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ద్రౌపదీ కల్యాణం నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణ, దర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. నీరుగట్టువారిపల్లెకు చెందిన ఉప్పు ఆంజనేయులు, ఉప్పు విజయలక్ష్మీ, ఉప్పు విద్య, ఉప్పు పవన్‌కుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషాతోపాటు టీడీపీ నాయకులు జేసీబీ మధు, చిన్నప్ప గౌడు పాల్గొన్నారు. అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు డాక్టర్ రామచంద్ర, బీజేపీ వెంకటేష్, పురం సహదేవ, తదితరులు పర్యవేక్షించారు.

వివాదాస్పద స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణం


గ్రామ సచివాలయం పక్కన స్థలంలో నిర్మించిన పునాదులు

మదనపల్లె టౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం-1 గ్రామ పంచాయతీలో ఉన్న వివాదాస్పద స్థలంలో ఓ వ్యక్తి బేస్‌మెంట్ నిర్మించాడు. సీటీఎం-1 గ్రామ పంచాయతీ కార్యాలయం అనుకుని 20 అడుగుల పొడవు, 30 అడు గుల వెడల్పుతో ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలోణజ రావిచెట్టును కూల్చేసి కలపను తరలించేశారు. ఆ తర్వాత చెట్టు ఉన్న స్థలం చుట్టూ చదును చేసి పునాదులు వేశారు.ఈ విషయమై గ్రామస్థులు తహసీల్దార్ ధనంజయులుకు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాలతో పనులను అడ్డుకున్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు ఈ స్థలం విషయమై విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గ్రామదేవతలకు ఘనంగా బోనాల సమర్పణ

● అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లారి



ముస్టూరమ్మకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు (ఇన్‌సర్ట్) ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

కలకడ, జూన్ 1(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాతిగుంటపల్లె, ఎర్రకోటపల్లెలో కొలువైన గ్రామదేవతలు ముత్యాలమ్మ, ముస్టూరమ్మలకు ఆదివారం గ్రామస్థులు బోనాలు సమర్పించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాతిగుంటపల్లె, దిగువ బట్టావారిపల్లె, ఎగువబట్టావారిపల్లె, శ్రీనివాసపురం కాలనీ, ఎర్రకోటపల్లె, ఎల్లంకివారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎగువబట్టావారిపల్లె ముత్యాలమ్మను ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాతిగుంటపల్లె సర్పంచ్ అలివేలు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కోనేని రెడ్డెప్పనాయుడు, వసంతనాయుడు, కోనేని ఆనంద్ కుమార్ నాయుడు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే వెంట పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, బరకం శ్రీనివాసులరెడ్డి, పివినాయుడు, గోపి తదితరులు ఉన్నారు.

అంబరాన్నంటిన జడ్పీ హైస్కూల్ స్వర్ణోత్సవాలు

● రెండు వేల మందికి పైగా హాజరు ● దాసరిపల్లి జయచంద్రారెడ్డి రూ.1.50 లక్షలు విరాళం


మాజీ సైనికులను సన్మానిస్తున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పాఠశాల 50 వసంతాల వేడుకలు వేడు కలు ప్రారంభమయ్యాయి. 50 బ్యాచులకు చెందిన రెండు వేల మందికిపైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక పీటీఎం రోడ్డులో 1974-75 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 50 బ్యాచుల్లో విద్యార్థులు పదవ తరగతి చదువుకున్నారు. వారంతా వేడుకలకు హాజరుకావడంతో పాఠశాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. 50 బ్యాచుల విద్యార్థులు ఒక్కో బ్యాచుగా వచ్చి నృత్యాలు చేశారు. పూర్వ విద్యార్థులు తాము చదుకున్న సమయంలో చేసిన అల్లరికి గుర్తు చేసుకుని రోజంతా సరదాగా గడిపారు. గ్రూపుల వారీగా కూర్చుని ఒకరినొకరు ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి చెప్పుకున్నారు. పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులను ఘ నంగా సన్మానించి స్వర్ణోత్సవాల జ్ఞాపికలు అందజేశారు. పాఠశాలలో చదివి దేశ సేవ చేసిన ప్రస్తుత సైనికులు, మాజీ సైనికులను పూర్వ విద్యార్థి టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు.ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో మం డల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని క్యాతశ్రీకి రూ.70 వేలు, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థులు మీనాక్షి, ఫహద్‌బాషాలకు ఒకొక్కరికి రూ.40వేలు చొప్పున దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డి అందజేశారు.

నెల తిరగకనే నెరవేరిన పూర్వ విద్యార్థుల హామీ


బోరు మోటారు అమర్చుతున్న పూర్వ విద్యార్థులు

కలికిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మహల్ తెలుగు ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1985-86 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు గురువులకిచ్చిన వాగ్దానాన్ని నెల తిరగక ముందే నెరవేర్చారు. గత నెల 11న పూర్వ విద్యార్థులంతా పాఠశాలలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యనందించిన పాఠశాల అభివృద్ధికి చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పాఠశాలలో నీటి సమస్య ఉన్నట్టు ప్రధానోపాధ్యాయుడు వారి దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల ఆవరణలో గతంలో వేసిన బోరు పూడిపోయి నిరుపయోగంగా మారిందని తెలిపారు. దీంతో ఆయా విద్యార్థులు ఆదివారం రిగ్గును రప్పించి బోరు లోతు చేయించారు. నీళ్ళు సమృద్ధిగా పడటంతో వెంటనే మోటారు తెప్పించి బిగించి పాఠశాలకు నీరు సరఫరా చేశారు.దీంతో ఉపాధ్యాయుల బృందం కృతజ్ఞతలు తెలిపింది. బోరుకు కొత్త మోటారు, స్టార్టరు, పైపులైన్లు ఏర్పాటు చేయడంతో దాదాపు రూ.లక్షన్నర ఖర్చయ్యింది.

నీటి సరఫరా చేసిన సందర్భంగా డీఈ ఇ.వాసు, సి.రమేష్‌కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఇ.శ్రీనివాసులు రెడ్డి, ఉపాధ్యాయుడు ప్రతాప్, బోరు సుబ్బయ్య, గౌస్, కాదర్‌వల్లి, నాగభూషణంలను పలువురు అభినందించారు.